# ప్రజా వాణి లో నమోదైన అర్జీలను జాప్యం లేకుండా సత్వరమే పరిష్కరించాలి

* **మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి**



మేడ్చల్ జిల్లా, మార్చి 2 (భారత శక్తి): ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి అదనపు జిల్లా కలెక్టరు విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులను డిఆర్ఓ (ఇంఛార్జి) చంద్రావతి లతో కలిసి అదనపు కలెక్టరు (153) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ ఈరోజు హౌజింగ్ డిపార్టుమెంట్ కు అధిక సంఖ్యలో (53) దరఖాస్తులు వచ్చాయని అన్నారు. ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని అదనపు కలెక్టరు అన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారిని మర్యాద పూర్వకంగా కలిసిన మారుతి ఎంక్లివ్ నూతన కమిటీ

కాప్రా, మార్చి 2 (భారత శక్తి): సైనిక్ పూరి లోని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసిన చర్ల పల్లి డివిజన్ పరిధిలోని మారుతి ఎంక్లవ్ నూతన కమిటీ సభ్యులు. ఈ సందర్భగా కాలనీ లో 2 కోట్ల 30 లక్ష రూపాయల నిధులతో రోడ్స్ పార్క్ అభివృద్ధి కి 95 లక్ష రూపాయలు మంజూరు చేయడం జరిగింది అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు మహేష్ గౌడ్ కాలనీ అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి సభ్యులు నరేష్, మనోహర్ బాబు, శివ శంకర్ గౌడ, నవీన్ యాదవ్, వెంకట్ రెడ్డి, కోటేశ్వర రావు, సంతోష్ రెడ్డి, మాధవ్ రావు, ఉమాకాంత్ రెడ్డి, గోపాల్ రెడ్డి, ఉపేంద్ర, సురేష్, అభిషేక్, సాగర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## జీహెచ్ఎంసీలో 99 రోజుల 'ప్రగతి ప్రణాళిక'

హైదరాబాద్, మార్చి 2 (భారత శక్తి): నగర పరిధిలో 99 రోజుల పాటు 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'ను ఫలితాలే లక్ష్యంగా అమలు చేయాలని పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, జీహెచ్ఎంసీ ప్రత్యేక అధికారి జయేష్ రంజన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆయన అధ్యక్షతన తొలి కార్పొరేషన్ సమావేశం జరిగింది. గత స్టాండింగ్ కమిటీ తీర్మానించిన 30 అంశాలపై చర్చించి, కమిటీ ఆమోదం తెలిపింది. 14 వారాల ప్రణాళిక.. వారానికో థీమ్ మార్చి 6 నుంచి జూన్ 12 వరకు సాగే ఈ ప్రణాళికలో ప్రతి వారం ఒక ప్రత్యేక అంశంపై (థీమ్) దృష్టి సారించనున్నారు. తొలి వారం (పారిశుద్ధ్యం): గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లను (GVP) పూర్తిగా తొలగించాలి. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసే వారికి జరిమానాలు విధించాలి. చెరువుల ప్రక్షాళన: ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు, స్వయం సహాయక సంఘాల సహకారంతో చెరువులు, సరస్సుల్లో వ్యర్థాలను తొలగించాలి.

* **ఈ-వేస్ట్, టెక్స్‌టైల్ వ్యర్థాల సేకరణ చేపట్టాలి.**

యువత నైపుణ్యం: యూత్ వీక్‌లో యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణతో పాటు యాంటీ డ్రగ్స్‌పై చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలి.
సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (CGG) మరో రెండు రోజుల్లో జీహెచ్ఎంసీ ఆస్తులు, అప్పులను మూడు కార్పొరేషన్లకు (జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరి) పంపిణీ చేసే ప్రక్రియ పూర్తి చేసి నివేదిక ఇస్తుందని జయేష్ రంజన్ వెల్లడించారు.

**ఆమోదం పొందిన కీలక నిర్ణయాలివే..**



ట్రాఫిక్ కష్టాలకు చెక్: ఓవైసీ జంక్షన్ ఫ్లైఓవర్ నుంచి సంతోష్‌నగర్ వైపు డౌన్ ర్యాంప్ నిర్మాణం, రసూల్‌పురా వద్ద 4 లేన్ల వన్‌వే రోడ్డు, రెతిబౌలి నానల్‌నగర్ జంక్షన్లలో గ్రేడ్ సెపరేటర్ల నిర్మాణం కోసం ఆస్తుల సేకరణకు గ్రీన్ సిగ్నల్. ఫ్లైఓవర్లు ROBలు: ఫలక్‌నుమా వద్ద సమాంతర ROB, ఫతేనగర్ ఫ్లైఓవర్ పునరుద్ధరణ, ఎన్ఎఫ్‌సీఎల్, టీవీ9 జంక్షన్లలో ఫ్లైఓవర్ పనులకు ఆమోదం. డ్రైనేజీ వ్యవస్థ: సనత్‌నగర్, ఫతేనగర్ ప్రాంతాల్లో సమగ్ర స్టార్మ్ వాటర్ డ్రైన్, అఫ్జల్ సాగర్ నాలా పునర్నిర్మాణం, శివాజీ నగర్ నుంచి చత్రినాక వరకు బాక్స్ డ్రెయిన్ పనులకు అనుమతి. పార్కింగ్ కన్వెన్షన్: ఖిల్వత్ చౌమహల్లా ప్యాలెస్ వద్ద మల్టీ లెవల్ పార్కింగ్, ఎన్‌బీటీ నగర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ పేరును 'కన్వెన్షన్ హాల్'గా మారుస్తూ నిర్ణయం. బడ్జెట్ కేటాయింపు: కొత్తగా ఏర్పడిన సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్లకు తలా రూ.500 కోట్ల చొప్పున బడ్జెట్ కేటాయింపు. ప్రస్తుతం ఈ కార్పొరేషన్ల ఖర్చులను జీహెచ్ఎంసీ జనరల్ ఫండ్ నుంచి నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, అదనపు కమిషనర్ సత్యనారాయణ, జోనల్ కమిషనర్లు ప్రియాంక అల, మందా మకరందు, ముకుంద రెడ్డి, మంగతాయారు, శ్రీనివాసరెడ్డి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## ఒకరి సౌకర్యం కోసం మరొకరిని ముంచొద్దు

* **గడ్డిఅన్నారం ప్రజలకు అండగా ఉంటా: ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి**



ఎల్బీనగర్, మార్చి 02 (భారత శక్తి) : అధికారుల అనాలోచిత నిర్ణయాల వల్ల ప్రజలు ఇబ్బంది పడకూడదని, గడ్డిఅన్నారం పరిధిలోని లోతట్టు ప్రాంతాల ముంపు సమస్య పరిష్కారానికి తాను నిరంతరం అండగా ఉంటానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఆయన సరూర్ నగర్ మినీ ట్యాంక్ బండ్ వద్ద జరుగుతున్న స్టార్మ్ వాటర్ అవుట్ లెట్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

**అధికారుల తీరుపై ఆగ్రహం**

జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ అధికారులు ప్రజావసరాలను విస్మరించి, అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి పనులు చేపట్టడంపై ఎమ్మెల్యే మండిపడ్డారు. ఎల్బీనగర్ నుంచి సాయి ఫంక్షన్ హాల్, పాత పోస్ట్ ఆఫీస్ మీదుగా సరూర్ నగర్ చెరువు వరకు నిర్మిస్తున్న స్టార్మ్ వాటర్ లైన్ వల్ల భవిష్యత్తులో కోదండరామ్ నగర్, తిరుమల నగర్, వివేకానంద నగర్, కమలా నగర్ కాలనీలకు మళ్లీ ముంపు ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో బైరామల్ గూడ, శాతవాహన నగర్ వంటి ప్రాంతాల్లో వరద ముప్పును తప్పించేందుకు తాము ఎంతో శ్రమించి బాక్స్ డ్రెయిన్ల నిర్మాణం చేపట్టామని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

**ప్రజాధనం వృథా చేయొద్దు:**

"వాస్తవానికి ఈ అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ (UGD) లైన్‌ను ఎస్టీపీ (STP) లో కలిపి, శుద్ధి చేసిన నీటిని మాత్రమే చెరువులోకి వదలాలి. కానీ, ప్రస్తుత అధికారులు నిబంధనలకు విరుద్ధంగా దీనిని స్టార్మ్ వాటర్ లైన్‌గా మార్చి నేరుగా అవుట్‌లెట్‌కు కలపడం సరికాదు" అని సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. తాత్కాలిక ప్రయోజనాల కోసం ప్రజాధనాన్ని వృథా చేస్తూ, లోతట్టు ప్రాంత ప్రజల ప్రాణాలను, ఆస్తులను పణంగా పెట్టవద్దని హెచ్చరించారు.

**మార్పులు చేసే వరకు పోరాటం:**

ప్రస్తుత పైప్‌లైన్ ప్రణాళికను మార్చి, దానిని ఎస్టీపీకి అనుసంధానించేలా అధికారులపై ఒత్తిడి తెస్తానని ఆయన కాలనీవాసులకు భరోసా ఇచ్చారు. ప్రజా ప్రయోజనాలే పరమావధిగా పనులు సాగాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్, రమణా రెడ్డి, యాద శంకర్, నాగిరెడ్డి, రాము తదితర కాలనీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## భారీగా గంజాయి పట్టివేత.. కియా కారులో అక్రమ రవాణా!

* **ఒడిశా టు మహారాష్ట్ర.. రూ. 41.21 లక్షల సరుకు సీజ్**
* **ముఠా గుట్టురట్టు చేసిన మల్కాజిగిరి SOT, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు**
* **ఇద్దరు నిందితుల అరెస్ట్.. 164.86 కిలోల గంజాయి స్వాధీనం**



హయత్‌నగర్/అబ్దుల్లాపూర్‌మెట్మార్చి 02 (భారత శక్తి) : సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశ.. అడ్డదారిలో డ్రగ్స్ రవాణా! ఒడిశా నుంచి కారులో గంజాయిని తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టును మల్కాజిగిరి ఎస్‌ఓటీ, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు సంయుక్తంగా రట్టు చేశారు. ఆదివారం మధ్యాహ్నం జరిపిన మెరుపు తనిఖీల్లో సుమారు రూ. 41.21 లక్షల విలువైన 164.86 కిలోల గంజాయిని పట్టుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, రవాణాకు వాడిన కియా కారుతో పాటు రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

**ట్రిప్పుకు 60 వేల ఆశ చూపి..**

పోలీసుల వివరాల ప్రకారం.. ఒడిశా గజపతి జిల్లాకు చెందిన నబిన్ సాబర్ (28), సుధాకర్ మండల్ (27) వృత్తిరీత్యా డ్రైవర్లు. ఆర్థిక ఇబ్బందుల సాకుతో వీరు గంజాయి రవాణా వైపు మళ్లారు. బరంపురానికి చెందిన ఓ డ్రగ్ పెడ్లర్ వీరికి వల వేశాడు. ఒడిశా నుంచి మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు గంజాయిని చేరవేస్తే ఒక్కో ట్రిప్పుకు రూ. 60 వేలు ఇస్తామని ఆశ చూపాడు. దీనికి ఒప్పుకున్న నిందితులు గతంలో రెండుసార్లు కర్ణాటకకు సక్సెస్‌ఫుల్‌గా సరుకును చేరవేశారు.

**కారు డిక్కీలో 80 ప్యాకెట్లు..**

ఈసారి 164.86 కిలోల గంజాయిని 80 ప్యాకెట్లుగా ప్యాక్ చేసి, కియా కారు డిక్కీలో రహస్యంగా దాచారు. హైదరాబాద్‌లోని ఎగ్జిట్ నంబర్ 11 వద్ద సరుకు డెలివరీ చేసేందుకు బయలుదేరారు. అయితే, పక్కా సమాచారంతో నిఘా పెట్టిన ఎస్‌ఓటీ క్యాంటోన్మెంట్ జోన్ బృందం, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు నల్గొండ ధర్మకాంట సమీపంలో తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా వచ్చిన కియా కారును ఆపి సోదా చేయగా అసలు విషయం వెలుగుచూసింది.



**గతం నుంచి గంజాయి అలవాటే!**

నిందితుడు నబిన్ సాబర్‌పై గతంలోనూ ఒడిశాలోని సాదర్ బెహ్రాంపూర్ పీఎస్‌లో కేసు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితులపై ఎన్.డి.పి.ఎస్ (NDPS) చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఆపరేషన్‌లో ఎల్‌బీ నగర్ జోన్ డీసీపీ డా. బి. అనురాధ, ఎస్‌ఓటీ అధికారులు, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# గంధంగూడలో రూ. 600 కోట్ల ప్రభుత్వ భూమిని రక్షించిన హైడ్రా

* **ఐటీ కారిడార్ సమీపంలో 6.30 ఎకరాల స్వాధీనం.. హైడ్రా**
* **ఆధ్వర్యంలో ఫెన్సింగ్**

హైదరాబాద్, మార్చి 2 (భారత శక్తి): ఐటీ కారిడార్‌కు ఆనుకుని ఉన్న గంధంగూడలో రూ. 600 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని హైడ్రా (HYDRAA) కాపాడింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం గంధంగూడ సర్వే నంబరు 86/పి లోని 6.30 ఎకరాల స్థలాన్ని గతంలో ప్రభుత్వం జలమండలికి కేటాయించింది. మురుగునీటి శుద్ధి కేంద్రం (STP) నిర్మాణానికి ఉద్దేశించిన ఈ భూమిని కొందరు ఆక్రమించి షెడ్లు నిర్మించారు. జలమండలి విజ్ఞప్తితో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు.. మున్సిపల్, రెవెన్యూ విభాగాలతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. ఆక్రమణలను గుర్తించి షెడ్లను తొలగించారు.




అనంతరం 6.30 ఎకరాల భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసి, అది ప్రభుత్వ భూమి అని తెలిపే బోర్డులను ఏర్పాటు చేశారు.

* **చెరువులు, శ్మశాన వాటికల కబ్జాపై 'హైడ్రా'కు ఫిర్యాదుల వెల్లువ**
* **ప్రజావాణిలో 42 దరఖాస్తులు.. బాచుపల్లి, ప్రగతినగర్‌లో అక్రమ నిర్మాణాలు**

**హైదరాబాద్:** చెరువుల ఎఫ్‌టీఎల్ (FTL) పరిధిలో అక్రమ నిర్మాణాలు, ప్రభుత్వ భూముల కబ్జాలపై హైడ్రా కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి భారీగా ఫిర్యాదులు అందాయి. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో మొత్తం 42 ఫిర్యాదులు రాగా, అధికారులు వాటిని పరిశీలించారు.

**ఫిర్యాదుల్లోని ముఖ్యాంశాలు:**

**ప్రగతినగర్:** ఇక్కడ 5 ఎకరాల శ్మశాన వాటిక స్థలంతో పాటు, డంపింగ్ యార్డుకు కేటాయించిన 4 ఎకరాల భూమి కబ్జాకు గురవుతోందని స్థానికులు ఫిర్యాదు చేశారు. సర్వే అధికారులు ధ్రువీకరించినా ఆక్రమణలు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.



**బాచుపల్లి:** బాచుపల్లి పెద్దకుంట చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్నా లెక్కచేయకుండా శ్మశాన వాటిక నిర్మిస్తున్నారని శిఖర రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫిర్యాదు చేసింది.

**మదీనాగూడ:** శేరిలింగంపల్లి మండలం మదీనాగూడలోని పోచమ్మ దేవాలయ భూమిలో అపార్ట్‌మెంట్ నిర్మిస్తున్నారని, కోర్టు స్టే ఉన్నా పనులు ఆపడం లేదని గ్రామస్థులు ఆరోపించారు. అమీన్‌పూర్ పోచమ్మకుంట ఎఫ్‌టీఎల్ పరిధిలోనూ ఇదే తరహా ఆక్రమణలు జరుగుతున్నాయని ఫిర్యాదులు అందాయి.

**బోడుప్పల్:** ఎస్‌బీఆర్ కాలనీలో 25 అడుగుల రహదారిని ఆక్రమించి దుకాణాలు నిర్మించారని, దీనివల్ల అంబులెన్స్‌లు, పాఠశాల బస్సులు వెళ్లడానికి వీల్లేకుండా పోయిందని కాలనీ వాసులు వాపోయారు. ఈ ఫిర్యాదులను హైడ్రా అదనపు సంచాలకులు పాపయ్య పరిశీలించి, తక్షణ పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.